ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఇంటి వద్దకే వైద్యసేవలు

- రాష్ట్రంలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత
- ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రారంభించిన మంత్రి డాక్టర్ సురేష్



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్వహించబోతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని యర్రగొండ పాలెం మండలంలోని గంగుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మీ ఊరిలోనే, మీ ఇంటి వద్దనే ఉచిత వైద్యం అందించేలా జగనన్న ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. గతంలో వైద్యం కోసం డాక్టర్లు కూడా లేని ఆసుపత్రుల చుట్టూ తిరిగి పడిగాపులు కాస్తూ డబ్బు, సమయం వథా చేసుకునే దుస్థితికి చరమగీతం పాడుతూ, ప్రతి ఒక్కరికీ మంచి ఆధునిక వైద్యం, ఉచితంగా వారి గ్రామంలోనే అందించే కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు. మంచానికే పరిమితమైన రోగులకు సైతం వారి గ్రామంలోనే, వారి గడప వద్దనే అవసరమైన వైద్యం అందజేయాలన్న తపనతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. 104 వాహనంతో అనుసంధానం చేసి, ఒక డాక్టర్ పిహెచ్.సి.లో ఉంటే మరో డాక్టర్ ప్రతిరోజూ తనకు కేటాయించిన గ్రామాలలోని డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, పాఠశాల, అంగన్‌వాడీ

▶ 2లో

'కోన'పై దళిత జనాగ్రహం

- బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే రఘుపతి వాఖ్యలను ఖండిస్తూ ఆందోళన బాట
- అధికార పార్టీ ఎస్సీ నేతలు కూడా ఖండించిన వైనం
- ఇప్పటికీ స్పందించని బాపట్ల వైసిపి ఎంపీ సురేష్



'కోన' వ్యాఖ్యలను ఖండిస్తూ బాపట్లలో గురువారం చేపట్టిన నిరసన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'బాపట్ల లోక్‌సభ స్థానాన్ని ఎస్సీ రిజర్వుగా మార్చడం చారిత్రక తప్పిదం' అని బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన వాఖ్యలు జిల్లాలో కలకలం రేపాయి. యస్సీ సామాజిక వర్గాల వారిని కించపరుస్తూ అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని దళిత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ పలు దళిత సంఘాలు ఆందోళన బాట పట్టాయి. కోన వ్యాఖ్యలను అధికార పార్టీకి చెందిన ఎస్సీ నేతలు కూడా ఖండించారు.

ఈ నెల 4న జరిగిన బాపట్ల జిల్లా ఆవిర్భావ వేడుకల సభలో ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రసంగిస్తూ లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన సమయంలో అప్పటికి ఎస్సీ రిజర్వు స్థానం అయిన నెల్లూరును ఓసి జనరల్ చేసేందుకు బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో చేరి ఉన్న పొన్నూరును గుంటూరు లోక్‌సభ స్థానంలో కలిపారని చెప్పారు. సంతనూతలపాడు నియోజకవర్గాన్ని బాపట్లలో చేర్చడంతో ఎస్సీ రిజర్వు అయ్యిందన్నారు. జెడి శీలం నియోజకవర్గాల పునర్విభజన కమిటీ సభ్యునిగా ఉండి నేదురుమల్లి జనార్ధనరెడ్డి కోసం ఇదంతా చేశారని వ్యాఖ్యానించారు. ఈ మార్పు చారిత్రక తప్పిదం అన్నారు. బాపట్ల లోక్‌సభ పరిధిలో మొదటి నుంచి ఎస్సీ సామాజికవర్గ ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారని దళిత సంఘాల నేతలు పేర్కొంటున్నారు. బాపట్ల జనరల్‌గా ఉన్న సమయంలోనే ఎస్సీ

▶ 2లో

స్పందించని బాపట్ల వైసిపి ఎంపీ సురేష్

బాపట్ల ఎస్సీ రిజర్వు స్థానం నుంచి వైసిపి తరపున ఎంపీగా గెలుపొందిన నందిగం సురేష్ కోన రఘుపతి వ్యాఖ్యల పట్ల స్పందించకపోవటం చర్చకు తావిస్తోంది. బాపట్ల ఎంపీగా తమ పార్టీకి చెందిన సురేష్ ఉన్నప్పటికీ ఈ స్థానం దళితులకు రిజర్వ్ చేయటం చారిత్రక తప్పిదం అన్నట్లుగా కోన వాఖ్యలు చేశారు. జిల్లా అంతటా రాజకీయ పార్టీలకతీతంగా దళిత సంఘాల నేతలు కోన వాఖ్యలను ఖండిస్తున్నారు. రెండు రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి.

బాపట్ల కలెక్టర్‌గా రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా రంజిత్‌బాషా రానున్నారు. ఈయన కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ.. బదిలీపై బాపట్లకు వస్తున్నారు. బాపట్ల కలెక్టర్‌గా పని చేస్తున్న విజయకృష్ణన్ సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.

ప్రకాశం జిల్లా జేసీగా శ్రీధర్

ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్ రానున్నారు. అభిషిక్త్‌కిషోర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీగా వెళ్లనున్నారు.



రంజిత్‌బాషా

మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు సంబంధిత శాఖలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి మాదకద్రవ్య నివారణ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్ధాల సాగు, రవాణా, వినియోగాన్ని కట్టడి చేసేందుకు శాఖల పరంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, తద్వారా కుటుంబ వ్యవస్థ దుర్భరం లాంటి అంశాలపై విద్యాసంస్థలలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని మెడికల్ షాపులు, ఇతర దుకాణాలలో ఎలాంటి మాదకద్రవ్యాలు, నిషిద్ధమైన మందులను విక్రయించకుండా డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గంజాయి. ఇతర మత్తు పదార్ధాల అక్రమ సాగును నివారించి సదరు రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంపై పోలీసు శాఖ మరింత దష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఎస్‌పి మల్లిక గర్గ్ మాట్లాడుతూ గంజాయి, నాటు పారాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో గంజాయి సాగు ద్వారా అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించాలనుకునే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలను సాగు చేసినా, వినియోగించినా అలాంటి వారిపై చట్టపరంగా తీసుకునే చర్యల గురించి సంకల్పం అనే కార్యక్రమం ద్వారా కాలేజీలలో కల్పిస్తున్న అవగాహన ద్వారా వస్తున్న మార్పును గురించి ఈ సందర్భంగా ఎస్‌పి వివరించారు కార్యక్రమంలో ఎఎస్‌పి నాగేశ్వరరావు, ట్రైనీ ఐపిఎస్ అధికారి అంకితా సురానా, డ్రగ్స్ విభాగ సహాయ సంచాలకులు జ్యోతి, ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్‌డిఒ అజయ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇన్‌ఛార్జి డిఎం,హెచ్ డాక్టర్ సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ వి. సుబ్బారావు పాల్గొన్నారు,

'కోన'పై దళిత జనాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక వర్గానికి చెందిన సలగల బెంజిమన్ ఎంపీగా తెలిచారని, ఎస్సీ వర్గానికి చెందిన విజయప్రాట్ కొద్ది తేడాతో ఓడి పోయారన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.

కోన రఘుపతిని సస్పెండ్ చేయాలి

టి కష్ణమోహన్, కెవిపిఎస్ బాపట్ల జిల్లా కన్వీనర్

బాపట్ల నియోజకవర్గం ఎస్సీ అవ్వడం చారిత్రక తప్పిదం అని ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యాఖ్యానించడాన్ని బట్టి ఎస్సీల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో అర్థమవుతోంది. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని దళితులను అవమానపరిచిన ఎమ్మెల్యే కోనా రఘుపతిని సస్పెండ్ చేయాలి. ఈ వ్యాఖ్యలను ఇప్పటివరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఖండించకపోవడాన్ని బట్టి దళితులపై చూపిస్తుంది సవతితల్లి ప్రేమే అని తెలుస్తోంది. కోన రఘుపతి వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలి. లేనియెడల వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది.

ఇంటి వద్దకే వైద్యసేవలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలను సందర్శించి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. అక్కడ ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తనకు కేటాయించిన అదే గ్రామాన్ని నెలలో కనీసం రెండుసార్లు సందర్శించి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. ఒకే వైద్యుడు పలుమార్లు అదే గ్రామంలో ఉన్న పేషెంట్‌ను సందర్శించడం ద్వారా ఆ డాక్టర్‌కు ఆ పేషంట్ హెల్త్ ప్రొఫైల్ మీద పూర్తి అవగాహన ఉండటంతో మెరుగైన చికిత్స అందించడం సులభతరం అవుతుందన్నారు. వైద్యునికి ఆ గ్రామంపై పూర్తి అవగాహనతో పాటు ఆ గ్రామంలోని ప్రతి వ్యక్తిని పేరుపేరునా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లలో 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు ఈ 104 వాహనంలో అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స కంటే ముందుగానే వ్యాధి నివారణ చేయాలనేది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య అధికారులు, సిబ్బంది పేర్లు, ఫోన్ నెంబర్లు బోర్డులు ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు. మీకు ఏదైనా అత్యవసర అవసరం ఏర్పడితే 104కు కాల్ చేయటం ద్వారా వైద్యుల సలహాలు, సూచనలు కూడా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీపర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, గుర్రపుశాల సర్పంచ్ వాడాల పద్మజ, ఎంపిడివో ఎం రంగసుబ్బ రాయుడు, తహశీల్దార్ కె రవీంద్రారెడ్డి, డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాహుల్, ఐటిడిఏ డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్, గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధి కమిటి చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి అస్వస్థత

పిసిపల్లి : పిసిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష రాస్తున్న కలిగిరి యామిని గురువారం అస్వస్థతకు గురైంది. వెంటనే ఉపాధ్యాయులు 108 వాహన సిబందికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది హరినారాయణ, రవిచంద్రారరెడ్డి హైస్కూల్ వద్దకు వచ్చి చికిత్స అందించారు. యామిని కొంత సేపటి తర్వాత కోలుకొని పరీక్ష రాసింది.

ఉచిత వైద్య శిబిరం

యర్రగొండపాలెం : మండల పరిధిలోనిపాలుట్ల గిరిజన గూడెంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సీన్ వేశారు. జ్వరపీడితుల నుంచి రక్తపూతలు తీసి చికిత్స అందించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తి గత పరిపరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్ఎం బాషా, మాధవి, జ్యోతిరాణి, జానారెడ్డి, శ్రీనివాసరావు, జాస్మిన్, కొండయ్య, నలగాటి వెంకట్రామయ్య నాయుడు , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి -శింగరాయకొండ


పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

శింగరాయకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు, కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాలె రంగారెడ్డి మనవడు మాలె భవేష్ పుట్టినరోజు వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురం సంఘం అంగనవాడీ కేంద్రం పరిధిలో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాలె రంగారెడ్డి మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్ -3150 తీర్మానం ప్రకారం ఏప్రిల్‌లో తల్లి, పిల్లల ఆరోగ్యంపై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా తన మనవడు పుట్టినరోజు వేడుకలు పిల్లలు, తల్లులు, గర్భిణుల మధ్య నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ సభ్యులు జెట్టి చంద్రశేఖర రెడ్డి, కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే..

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఖాళీ సమయాలలో పనిచేసి అదనపు ఆదాయం ఆర్జించమంటూ, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల గురించి వివరించారు. 'ఇంటి వద్దే ఉంటూ ఖాళీ సమయాలలో పనిచేస్తూ అదనంగా డబ్బు సంపాదించండి.. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు అదనపు ఆదాయం సంపాదించవచ్చు' వంటి ఆకట్టుకునే విధంగా ప్రకటనలు కుమ్మరించడంతో ఆర్థిక కష్టాలు కొంతైనా తీరతాయని నమ్మి జాబ్ పోర్టల్స్‌లో నిరుద్యోగులు రెజ్యూమ్‌లు అప్‌లోడ్ చేస్తుంటారని, ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు నిరుద్యోగులు జాబ్ పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేసిన రెజ్యూమ్‌ల నుంచి వివరాలను సేకరించి నిరుద్యోగులకు తరచూ ఫోన్‌లు చేస్తూ సంభాషణలు కొనసాగిస్తారని, రిజిస్ట్రేషన్ పేరిటగానీ లేక మరేదైనా కారణం చెప్పి తమ వ్యక్తిగత ఖాతాలో డబ్బులు జమ చేయమని కోరుతారని, అలా జమచేసిన వారు డబ్బు కోల్పోతారని తెలిపారు. కాబట్టి ఉద్యోగార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సంస్థలు జీతాలు ఇచ్చి నియమించుకుంటాయి కానీ డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇవ్వవు అనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఆఫర్ లెటర్‌లో కంపెనీల లోగోలు, లెటర్ హెడ్స్ తదితర వివరాలను ధ్రువీకరించుకోవాలని, అపరిచితులకు డబ్బులు బదిలీచేసే ముందు తార్కికంగా ఆలోచించాలని హెచ్చరించారు. బ్యాంక్ అకౌంట్స్, టాక్స్ ఫామ్స్, పాన్ నెంబర్, ఆధార్ కార్డ్ లాంటివాటిని అడుగుతున్నారంటే అనుమానించాలని తెలిపారు. కంపెనీలు అధికారిక వెబ్‌సైట్లలోనే ఉద్యోగ ఖాళీల వివరాలను, అవసరాలను పొందుపరుస్తున్నాయన్నారు. కాబట్టి ఇలాంటి నమ్మదగ్గ మార్గాలలో ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తే మోసపోవడానికి ఆస్కారం ఉండదని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇలాంటి పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఈ తరహా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని ఎస్పీ తెలియజేశారు.



పోలీసులు రూపొందించిన ప్రచార చిత్రం

ఫ్యామిలీ డాక్టర్.. ప్రజలకు వరం: కలెక్టర్

ప్రజాశక్తి-వేమూరు, బాపట్ల జిల్లా

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే గొప్ప వరమని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని వేమూరు మండల వ్యవసాయ మార్కెట్ యార్డులో లాంఛనంగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన 104 అంబులెన్స్ వాహనాన్ని, వైద్య సేవలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ప్రారంభించగా ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా తిలకించేలా వేమూరులో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలంతా ఆరోగ్యంతో క్షేమంగా ఉండాలని ఇంటివద్దకే వైద్య సేవలను అందించే బృహత్తరమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఇందుకోసం గత ఏడాది ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించిందన్నారు. ఇప్పటివరకు 80 శాతంగా ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వివరాలను సేకరించినట్లు తెలిపారు. నిరుపేదల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆరు గ్రామాలలోని సుమారుగా 2,500 మంది జనాభాకు ఇంటివద్ద వైద్యం అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని అన్నారు. ఆయా గ్రామాలు సందర్శించేలా ఆ కేంద్రం పరిధిలో 104 అంబులెన్స్ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. 12 రకాల వైద్య పరీక్షలు, 160 రకాల ఔషధాలు ప్రజలకు పంపిణీ చేసేలా నూతన వ్యవస్థకు రూపకల్పన చేసిందన్నారు. సంబంధిత డాక్టర్ ఆ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తారన్నారు. తదుపరి నడవలేని స్థితిలో ఉన్న పేదలకు వైద్యం అందించేలా ఇంటింటిని వైద్యులు సందర్శిస్తారని వివరించారు. ఆడపిల్లల జననం నుంచి గర్భిణి, బాలింతల వరకు సంరక్షించేలా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆడపిల్లలు బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పిహెచ్‌సిల పరిధిలో కాన్పులు జరగాలనే ఉద్దేశంతో పర్యవేక్షణ కమిటీలను నియమించామన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యం చేయించుకోలేక అనారోగ్యంతో ఎవరూ మృతి చెందరాదనే లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రేపల్లె ఆర్‌డిఓ పార్థసారథి చెప్పారు. ప్రభుత్వం ప్రారంభించిన నూతన విధానంతో ప్రజలంతా ఆరోగ్యంతో సుభిక్షంగా ఉంటారని ఆయన వివరించారు. ముఖ్యంగా రక్తహీనత నివారణపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్యాధికారులే పేదల ఇంటికి వచ్చి మంచి వైద్యం అందిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ తెలిపారు. బాపట్ల జిల్లా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద 1.50 లక్షల మంది ప్రజలు ప్రైవేట్ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం పొందారన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి జి హేమలత, తహశీల్దారు, ఎంపిడిఓ, అధికారులు పాల్గొన్నారు.


ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


రేపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

రేపల్లె: రేపల్లె మండలం, వడ్డివారిపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని (ఇంటింటికీ డాక్టర్) గ్రామ సర్పంచ్ వడ్డి సునీత ప్రారంభించారు. 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం నేటి నుంచి అధికారికంగా అమలు చేస్తున్నట్లు మోళ్ళగుంట వైద్యాధికారి డాక్టర్ ప్రవల్లిక తెలియజేశారు. ప్రతి నెల మండలం పరిధిలో ఉన్న గ్రామాలను రెండుసార్లు సందర్శించి రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని, మంచానికి పరిమితమైన రోగులకు, గర్భిణులకు, బాలింతలకు, చంటి బిడ్డలకు, అంగన్‌వాడీ స్కూల్ పిల్లలకు, పాఠశాల పిల్లలకు కూడా వారి వద్దకే వెళ్లి అవసరమైన వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని డాక్టర్ ప్రవల్లిక తెలియజేశారు. గ్రామీణ ప్రజలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు అందించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న కుటుంబాలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తమ కుటుంబ వైద్యుడిని సంప్రదిస్తున్నారు. వారి ఆరోగ్యం పట్ల సంబంధిత వైద్యుడు నిరంతరం ఫాలోఅప్‌లో ఉంటారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తుల ఆరోగ్యంపై డాక్టర్‌కు సమగ్ర అవగాహన ఉంటుంది. ఒక అనుబంధం ఏర్పడి ఆ కుటుంబానికి మెరుగైన వైద్య సంరక్షణ అందుతుంది. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ ఉచితంగా అందించాలన్నది ఫ్యామిలీ డాక్టర్ విధానం లక్ష్యం అన్నారు. ఎవరైనా రోగికైనా మెరుగైన వైద్యం అవసరం అని భావిస్తే ఫ్యామిలీ డాక్టర్ అక్కడి నుంచే పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు. రోగిని దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించడం, వైద్యం అందేలా చూడటం లాంటి కార్యకలాపాలను సీహెచ్‌వో, ఏఎన్ఎం పర్యవేక్షిస్తారు. వీరు విలేజ్ ఆరోగ్యమిత్రగా వ్యవహరిస్తారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో రోజు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవల్లిక, ఆరోగ్య విస్తరణ అధికారి వైవీ రావ్, సూపర్‌వైజర్ ప్రేమకుమారి, పద్మావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గా, ఏఎన్ఎం ప్రవల్లిక, మేల్ హెల్త్ అసిస్టెంట్ సుభాషణ్ బాబు, మోషే, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఇంటివద్దకే వచ్చి సేవలు అందిస్తున్నట్లు గ్రామసర్పంచ్ బండారు సుమతి జక్రయ్య తెలిపారు. ప్రజలు వైద్య సేవలు వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని వైద్యాధికారి టి అంజలి కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఆర్ రత్తమ్మ, తిరుపతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు: గతంలో వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మన ఊరిలోనే మన ఇంటి వద్దే, ఉచిత వైద్యం ప్రజలకు అందిస్తామని ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద, పిహెచ్‌సి వైద్యాధికారి నిర్మల్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, నేటి నుంచి ఇంటి వద్దనే 14 రకాల పరీక్షలు మరియు 67 రకాల మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అనంతవరపు మార్తమ్మ, ఎంపీహెచ్‌ఇఓ ఎం భూపాల్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది దివ్య జ్యోతి, రమావత్ సాయినాయక్, సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపట్నం: పేదల వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యులు బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలో ముత్తుపల్లి పంచాయతీలో గురువారం విలేజీ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచి పిట్టు లక్ష్మి ఏడుకొండలురెడ్డి మాట్లాడుతూ ఎందుకూ పనికిరాని భూములను మోపిదేవి బంగారు భూములుగా మార్చారని పేర్కొన్నారు. ఆయన వల్లే ఈ గ్రామం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. మోపిదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ఆంధ్ర ముఖ్యమంత్రికే సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల వెంకట హరినాథ్ బాబు, జడ్పీటిసి నర్రా సుబ్బయ్య, సర్పంచి లక్ష్మీ ఏడుకొండలు రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి, డాక్టర్లు, వైద్య సిబ్బంది, శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


నాగార్జున మృతదేహం వెలికి తీస్తున్న రెస్క్యూ బృందం (ఇన్‌సెట్‌లో) నాగార్జున (ఫైల్)

గల్లంతయిన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని దాసరిగడ్డకు చెందిన చెరుకూరి నాగార్జున(18) అనే యువకుడు బుధవారం సాయంత్రం తన సహచర మిత్రులు, విద్యార్థులతో కలిసి నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీ లేఔట్ సమీపంలో ఉన్న వాగులోకి ఈతకు వెళ్లాడు. సుమారు 10 మంది విద్యార్థులు వాగు వద్దకు వెళ్లారు. అక్కడ ముందుగా నాగార్జునతో పాటు మరో నలుగురు వాగులోకి దిగారు. ఈ క్రమంలో నాగార్జునకు ఈత సరిగా రాకపోవడంతో లోపలికి జారిపోయినట్లు ఆలస్యంగా సహచర మిత్రులు గమనించారు. నాగార్జున కనిపించకపోవడంపై సహచరులు ఆందోళన వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు పొదిలి పోలీసులను ఆశ్రయించారు. స్థానిక పోలీసుల ఆదేశాలతో దర్శి అగ్నిమాపక సిబ్బంది వాగు వద్దకు చేరుకున్నారు. వెంటనే రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగి సుమారు మూడు గంటల పాటు వాగులో గాలింపు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. గల్లంతయిన నాగార్జున ఆచూకీ లభించకపోవడం, చీకటి పడడంతో మరలా గురువారం ఉదయం గాలింపు చేపట్టారు. వాగులో లోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో పూడికలో కూరుకుపోయి ఉండవచ్చునని అధికారులు భావించి తెల్లవారుజాము నుంచి రెస్క్యూ టీం గాలింపు చేపట్టగా సుమారు 30 అడుగుల లోతులో నాగార్జున మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం వెలికితీత అనంతరం పంచనామా నిర్వహించి మృతుడి స్వగ్రామం తాళ్లూరు మండలం బొద్దికూరపాడు పంచాయతీ చింతలపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-కంభం రూరల్

మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ ఖాసింబీ(60) అను ఆమె కంభం నుంచి బైకుపై మార్కాపురం తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో బైకు వెనక కూర్చున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి కంభం సమీపంలోని సాధన కళాశాల వద్ద జరిగినట్లు ఎస్ఐ వి నాగమల్లేశ్వరరావు తెలిపారు. మార్కాపురం పట్టణానికి చెందిన పల్లపాటి చెన్నకేశవులు అను వ్యక్తి మోటార్ సైకిల్‌పై కంభం వచ్చి రాత్రి 9.30 గంటల సమయంలో తిరిగి మార్కాపురం వెళుతుండగా మార్గమధ్యంలో కాలేజీ దాటిన తరువాత లక్ష్మీ నరసింహ ఫ్లై యాష్ బ్రిక్స్ వద్ద కంభం నుంచి మార్కాపురం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో వెనక కూర్చొని ఉన్న ఖాసింబీ కిందపడి అక్కడికక్కడే చనిపోయింది. మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కంభం నాగమల్లేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్: ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా పక్కకు తిరగడంతో వెనుకనే వస్తున్న బైక్ అదుపు తప్పి లారీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు నాగరాజుపల్లి రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన దివ్వే వేణు, కుందేటి హనుమంతరావు వ్యక్తిగత పనుల మీద మార్టూరు వెళుతున్నారు. ఈ క్రమంలో వీరి బైక్ ముందు వెళుతున్న లారీ స్థానిక లక్ష్మి సుధా వే బ్రిడ్జిలోకి ఒక్కసారిగా మలుపు తిరగడంతో బైక్ అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేణు, హనుమంతరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఇరువురిని ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వేణును చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



అంగన్‌వాడీ టీచర్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు

అంగన్‌వాడీ టీచర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-వేటపాలెం: దేశాయిపేట అంగన్‌వాడీ సెక్టార్‌లో అంగన్‌వాడీ టీచర్ ఏ శివనాగేంద్రం సేవలు కొనియాడదగినవని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఏ శివ నాగేంద్రానికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ శివ నాగేంద్రం సేవలను ప్రశంసించారు. ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. తనకు వీడ్కోలు పలికిన అందరికీ శివ నాగేంద్రం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు శిరోమణి, వరలక్ష్మి, రమదేవి, కమలకుమారి, పూర్ణిమ, ఉష, బ్యులా, సుప్రియ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

10 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి-అద్దంకి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి ఉచితంగా టైలరింగ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ అంశాలపై స్త్రీ పురుషుల అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నియోజకవర్గ నైపుణ్యాభివృద్ధి కోఆర్డినేటర్ సిహెచ్ రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు అభ్యర్థులకు కుట్టు మిషన్‌పై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి సుధాకర్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు 8978886348 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

హిందీ పరీక్షకు పది మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలంలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షకు పది మంది గైర్హాజరయ్యారు. మొత్తం 6 సెంటర్లలో 895 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 885 మంది పరీక్షలు రాశారు. 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలకు అన్ని సెంటర్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు.

4 నుంచి కొండమంజులూరులో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-పంగులూరు: కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఆశీస్సులతో మే నెల 4వ తేదీ నుంచి కొండమంజులూరు గ్రామంలో రెండు జిల్లాల స్థాయిలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు నరేష్, సురేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి కొండమంజులూరు క్రికెట్ గ్రౌండ్లో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు మొదటి బహుమతిగా 35,116 రూపాయలు, షీల్డ్, రెండో బహుమతిగా రూ.25,116, షీల్డ్, మూడో బహుమతిగా రూ.15,116, షీల్డ్, నాలుగో బహుమతిగా రూ.10,116, షీల్డ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు మాన్ ఆఫ్ ది మ్యాచ్ ఉంటుందని, మ్యాన్ ఆఫ్ సిరీస్‌కు రూ.2,116 ఇస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే టీములకు బాల్ ఉచితంగా ఇస్తామని, ఒక టీంలో ఆడిన క్రీడాకారుడు మరో టీంలో ఆడటానికి వీలులేదని, షెడ్యూల్ ప్రకారమే మ్యాచులు జరుగుతాయని, ఆన్‌లైన్లో స్కోరు వేస్తామని తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 27వ తేదీన డ్రా తీస్తామని నరేష్, సురేంద్ర తెలిపారు. వివరాలకు 8074296161, 8317618436 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నక్కలపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలం నక్కలపాలెంలో 494వ నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన పొనుగుపాటి అంజమ్మ(82) మృతి చెందగా కుటుంబ సభ్యులు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. ప్రతినిధులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్‌రావు గుంటూరు శంకర కంటి వైద్యశాలకు సమాచారం అందిచారు. వైద్యులు రుతుజ, దీక్ష, సుమలతలు నక్కలపాలెం వచ్చి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసినందుకు కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, పద్మలను రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావులు అభినందించారు.

'కోన'.. నీకిది సమంజసమేనా?

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి ● దళిత కులాల ఐక్యవేదిక నిరసన

ప్రజాశక్తి-చీరాల

బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు స్థానం అవ్వడం దురదృష్టకరమని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని దళిత కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి రాజు అన్నారు. బాపట్లలో ఉన్న అంబేద్కర్ విగ్రహం కాళ్లకు మొక్కి కోన రఘుపతి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లో దళిత కులాల ఐక్యవేదిక, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత ఓట్లతో గెలిచానని చెప్పుకుంటున్న వైసిపి అధికారం లోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు దళితులపై అనేక రకాలుగా భౌతికంగా, ఆర్థికంగా, మానసికంగా దాడులు చేస్తూనే ఉన్నారని అన్నారు. గెలవటానికి, పార్టీలు అధికారంలోకి రావటానికి దళితుల ఓట్లు కావాలి కానీ దళితులకు మాత్రం ప్రత్యేకంగా నియోజకవర్గాలు ఉండ టాన్ని సహించలేకపోవడం అగ్రకుల దురహంకారానికి నిదర్శనమని అన్నారు. కాబట్టి వెంటనే కోన రఘుపతి బాపట్లలో ఉన్న అంబేద్కర్ విగ్రహం కాళ్లకు మొక్కి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలను అవమానపరిచిన కోన రఘుపతిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు మాచవరపు జూలియన్, దుడ్డు విజయ్, సుందర్, ఎస్కే మౌలాలి, ఉమా మహేష్, పైడి రమేష్, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.



చీరాల ముక్కోణపు పార్క్ సెంటర్లో నిరసన తెలియజేస్తున్న దళిత కులాల ఐక్యవేదిక నాయకులు



బాపట్లలో మాట్లాడుతున్న టిడిపి దళిత నాయకులు

బాపట్ల: బాపట్ల పార్లమెంట్‌ను ఎస్‌సి రిజర్వుడుగా చేయడం చారిత్రాత్మక తప్పిదమని అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని దళిత జాతికి క్షమాపణలు చెప్పాలని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం బాపట్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బాపట్ల నియోజకవర్గంలో దళితుల ఓట్లతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోన రఘుపతి పదవి అహంకారంతో ఆ దళితులనే అవమానించే విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దళితులకు చట్టసభల్లో పోటీ చేసే అర్హత లేదా అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో దళితులే ఆ అహంకారాన్ని తుదముట్టిస్తారని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. దళితులకు కోన రఘుపతి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అద్దంకి: బాపట్ల పార్లమెంటును ఎస్సీ రిజర్వుడు చేయడం చారిత్రక తప్పిదమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన వ్యాఖ్యలను బిఎస్‌పి అద్దంకి నియోజకవర్గ అధ్యక్షులు మంద జోసెఫ్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం మంద జోసెఫ్ మాట్లాడుతూ దళిత ఓట్లతో గెలిచిన కోన రఘుపతి నేడు వారినే అవమానించేటట్లు మాట్లాడటం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అలా బాధ్యత లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. దళిత జాతికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కోన రఘుపతికి దళితులు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గరంగరంగా కౌన్సిల్ సమావేశం

మున్సిపల్ అధికారుల తీరుపై కార్పొరేటర్ల ప్రశ్నల వర్షం ● పారిశుధ్య కార్మికుల కొరత, తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. మున్సిపల్ అధికారుల తీరుపై కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. డివిజన్లలో చేపట్టే పనులు కార్పొరేటర్లకు తెలియకుండా జరగడం అశ్చర్యానికి గురిచేస్తోందని వారు మండిపడ్డారు. ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన గురువారం జరిగింది. ఒంగోలు నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిని కార్పొరేటర్లు ఖండించారు. ప్రతిపక్ష పార్టీ కార్పొరేటర్లతో పాటు అధికార పార్టీ కార్పొరేటర్లు కూడా అసంతృప్తిని వ్యక్తం చేశారు. మొత్తం 23 అంశాల్లో 2వ, 5వ అంశం రద్దు చేయగా, 21 అంశాలను సభ్యులు ఆమోదించారు.





ఒంగోలు నగర పాలక సంస్థ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, అధ్యక్షత వహించిన మేయర్ గంగాడ సుజాత

కార్పొరేటర్లకు తెలియకుండా పనులు ఎలా చేస్తారు?

తమకు తెలియకుండా డివిజన్‌లలో అభివృద్ధి పనులు ఎలా చేస్తారని విపక్ష, అధికార, ప్రతిపక్ష సభ్యులు అధికారులను నిలదీశారు. డివిజన్లలో చేపట్టే పనులు కూడా తెలియజేయకపోవటంతో కార్పొరేటర్లు ఎందుకని ప్రశ్నించారు. మరలా ఇలా జరకుండా చూసుకుంటామని అధికారులు సర్దిచెప్పారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

తమ డివిజన్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికార పార్టీ కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. 39వ డివిజన్‌లో తీవ్రంగా ఉందన్నారు. అక్కడ ఉన్న ట్యాంకర్ నిరుపయోగంగా ఉందని, ట్యాంకర్‌కు చిన్న లీకేజ్ ఉందని, మరమ్మతు చేయిస్తే ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. 12వ డివిజన్‌లో కూడా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. తమ డివిజన్లలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని టిడిపి కార్పొరేటర్లు దాచూరి రమణయ్య, శ్రీనివాసరావు, టి రవితేజ, కిట్టు, మస్తానమ్మ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.

కుక్కల బెడదను నివారించాలి

నగరంలో కుక్కల బెడద తట్టుకోలేకపోతున్నామని పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య అన్ని డివిజన్లలో ఉందన్నారు. కుక్కల చేతిలో ప్రాణాలు పోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ ఆలోచన చేయాలని సూచించారు. కుక్కలను చంపే అధికారం లేదని, కొన్ని చట్టాలు ఉన్నాయని, వాటికి లోబడే మనం చేయాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

అధికారుల తీరుపై జనసేన కార్పొరేటర్ ఆగ్రహం

తమ డివిజన్‌లో సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై 38వ డివిజన్ జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 9 నెలల నుంచి డివిజన్‌లో డ్రైన్లు, అక్రమ కట్టడాల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇవ్వడంతో మలగా రమేష్ శాంతించారు. కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్లు వేమూరి బుజ్జి, మాధవరావు, అధికార వైసిపి, టిడిపి, జనసేన కార్పొరేట్లు, కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీర్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

104 సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలంలోని దేవరపల్లిలో గురువారం 104 వాహన ప్రారంభోత్సవం జరిగింది. గ్రామ సర్పంచ్ పలతోటి లాజరు, ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ 104 సేవలు ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల సురేష్ బాబు, ఎంఎల్‌హెచ్‌పి జయశ్రీ, కార్యదర్శి కందిమళ్ల శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. 100 రకాల పరీక్షలు నిర్వహించామని కృష్ణమోహన్ తెలిపారు.



దేవరపల్లిలో 104 సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా బూచేపల్లి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని, కార్యకర్తలు ,అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బూచేపల్లి శివప్రసాదరెడ్డిని గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ బాలికల హాస్టల్ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు దాసరి లక్ష్మి నారాయణ, పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, యూత్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, పులివెంకటరెడ్డి, కౌన్సిలర్లు భీమనవెంకటరావు, ఎ.రామబ్రహ్మం, తప్పెట బాబూరావు, భీమన రమేష్, పత్తి కోటేశ్వరరావు, తెల్లమేకల గాంధీ, వివిధ మండలాల జడ్‌పిటిసిలు, దర్శి నియోజక పరిధిలోని ఐదు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఫోన్ ద్వారా శివప్రసాదరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. **దర్శి :** దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం నిర్వహించారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ కార్పోరేషన్ డైరెక్టరు ఎస్ఎం.బాషా, మాజీ ఎంపిపి ఇత్తడి దేవదానం, మాజీ సర్పంచులు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి, రాజశేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు** : దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు జడ్‌పిటిసి దద్దాల నారాయణ తదితరులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దద్దాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనిగిరిలోని జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలో జడ్‌పిటిసి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నారాయణస్వామి, మాజీ సర్పంచి గొబ్బిళ్ళ శ్రీనివాసులు పాల్గొన్నారు.



బూచేపల్లి శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



దర్శిలో కేక్ కట్‌చేస్తున్న బూచేపల్లి అభిమానులు

ఆదర్శమూర్తి వరికూటి కోటమ్మ

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-టంగుటూరు

వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమతపాణిల మాతమూర్తి దివంగత వరికూటి కోటమ్మ ఆదర్శమూర్తి అని ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు కొనియాడారు. మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో వరికూటి కోటమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. సభలో వక్తలు మాట్లాడుతూ వరికూటి కోటమ్మ డిడిఒగా విధులు నిర్వహించే సమయంలో పేదల అభివద్ధికి నిస్వార్ధ సేవలు అందించి ఎంతో పేరు, ప్రతిష్టలు సంపాదించారని కొనియాడారు. కోటమ్మ సంస్మరణ సభకు జిల్లా నలు మూలలు, కొండపి నియోజక వర్గం పరిధిలోని 6 మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, వరికూటి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వరికూటి కుటుంబ సభ్యులు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె. బేబీరాణి, అశోక్‌బాబు సతీమణి లక్ష్మి, గోగినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, వైసిపి నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, ఆనం సత్యనారాయణ రెడ్డి, మల్లవరపు రాఘవరెడ్డి, చక్కా రాజేశ్వరరావు, గొల్లపూడి సునీత, తొట్టెంపూడి సురేష్, అధికారులు తదితరులు వరికూటి కోటమ్మ చిత్ర పటానికి నివాళులర్పించారు.



కోటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్



కోటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి దద్దాల నారాయణ

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కనిగిరి పట్టణంలోని ఒకటో వార్డులో సిండికెట్ మెంబర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని హనుమంతునిపాడు జడ్‌పిటిసి దద్దాల నారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మంచి కార్యక్రమాలకు తన ప్రోత్సాహం తప్ప ఉంటుందన్నారు. వేసవి పేదల దాహార్తీ తీర్చడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నిగారి మహేష్, ఇండ్ల హరేంద్ర, వల్లపు బాలు, షేక్ ఆరిఫ్, సునీల్, మనోజ్, చిన్ని, అశోక్, చందు పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాస్'లో ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలు

బ్రోచరును ఆవిష్కరించిన వైద్యులు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో స్పెషల్ హెల్త్ ప్యాకేజీలను హాస్పిటల్ డైరెక్టర్లు ప్రకటించారు. హాస్పిటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రూ.8100 విలువైన వెల్ ఉమెన్ హెల్త్ ప్యాకేజీని రూ.2999కే చేస్తామన్నారు. రూ.8100 విలువైన మాస్టర్ హెల్త్ ప్యాకేజీని రూ.2999 కే అందిస్తున్నట్లు తెలిపారు. రూ.2750 విలువైన కార్డియాలజి హెల్త్ చెకప్‌ని రూ.999కే చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.2750 విలువైన డయాబెటిక్ హెల్త్ ప్యాకేజీని రూ.999కే అందిస్తున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు అందుబాటులో వుండే విధంగా టైం లిమిట్ లేకుండా శాశ్వత ప్రత్యేక మెడికల్ ప్యాకేజీలుగా వీటిని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్యాకేజీలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాస్ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్, కన్సల్టెంట్ వైద్యులు శ్రీధర్ చివుకుల, పోకూరి శ్రీనివాస్, రాంబాబు, జ్యోత్స్న, యు.శ్రీనివాస్, పవన్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



బ్రోచరును ఆవిష్కరిస్తున్న వైద్యులు



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న వినోద్ కుమార్

మంత్రి సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను జిల్లా ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబరు గూడూరు వినోద్ కుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మా నాయక్, రామచంద్రాపురం ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

అబ్రహాంకు అభినందనలు

ప్రజాశక్తి-కొమరోలు



కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన బందెల అబ్రహం జిల్లా జడ్జిగా నియమితుల య్యారు. ఇటీవల జిల్లా జడ్జి నియామకానికి నిర్వహించిన అర్హత పరీక్షల్లో అబ్రహం ఉత్తీర్ణత సాధించారు. అబ్రహం గిద్దలూరు కోర్టులో లాయర్‌గా విధులు నిర్వహిస్తూ జిల్లా జడ్జి నియామకానికి పరీక్ష రాశారు. ప్రస్తుతం అబ్రహం వినుకొండ, గుంటూరు ప్రాంతాలలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గావిధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అబ్రహంను పలువురు అభినందించారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న శిద్దా దంపతులు

హరిహరక్షేత్రంలో శాంతి కల్యాణం

ప్రజాశక్తి-చీమకుర్తి

హరిహరక్షేత్రం 17వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శాంతి కల్యాణం నిర్వహించారు విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద్రేంద్రస్వామి పర్యవేక్షణలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో శాంతి కల్యాణం నిర్వహించారు. చీమకుర్తి, ఒంగోలు, పొదిలి ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి శాంతి కల్యాణాన్ని తిలకించారు. తొలుత పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ కుమార్, శృతి దంపతులు, శిద్దా పాండు రంగారావు దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు,శిద్దా సాయిబాబు దంపతులు, బొమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం దంపతులు, గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఎ. గిరిబాబు దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-పామూరు


మండల పరిధిలోని చింతలపాలెం ఎస్‌సి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి జ్ఞాపకార్థం ప్లేట్లు గురువారం పంపిణీ చేశారు. ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు డోలా శేషాద్రి ఆధ్వర్యంలో పేట్లు అందజేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉనన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా...

శ్రీలక్ష్మి చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్య నిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.
దక్షిణ భారత దేశంలో ప్రత్యేకతను సంతరించుకున్న వైష్ణవ క్షేత్రాల్లో మార్కాపురం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం ఒకటిగా చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. ఆలయాన్ని విజయనగర చక్రవర్తులు నిర్మించినట్లు ఆలయంలోని శాసనాలు ద్వారా తెలుస్తోంది. అరుదైన శిల్ప సంపద శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి సొంతం. బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా యాత్రికులు తరలి వస్తారు.
చైత్రశుద్ధ పౌర్ణమి రోజున స్వామివారి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 14 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి


చెన్నకేశవుని ఆలయ ప్రాంగణం

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణతో గురువారం ఉత్సవాలు ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారు జామున కన్నుల పండుగలా చెన్నయ్య కళ్యాణ వేడుక నిర్వహిస్తారు. ఈ కళ్యాణ వేడుకను తిలకించేందుకు జనం పెద్ద సంఖ్యలో విచ్చేస్తారు. 7న చంద్రవాహనం, 8న సింహ వాహనం, 9న శేష వాహనం, 10న వ్యాళి వాహనం, 11న పొన్న వాహనం, 12న హనుమంత వాహనం, 13న గరుడ వాహనం, 14న గజ వాహనం, 15న సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. 16న అశ్వ వాహనం, 17న హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.18న వసంతోత్సవం, ఊంజల్ సేవ, 23న 16 రోజుల పండుగతో వేడుకలు ముగుస్తాయి.

వెంకటాద్రిపాలెంలో...

యర్రగొండపాలెం : మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామంలోనున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమైనట్లు దేవాలయ కార్య నిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల7న సింహ వాహనం, 8న శేష వాహనం, 9న హనుమంత వాహనం, 10న గరుడ వాహనం, 11న గజోత్సవం, 12 రథోత్సవం, 13 అశ్వ వాహనం, 14న పూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 10న జగజ్యోతి బండి కట్టనున్నట్లు తెలిపారు.

సుస్థిర సమాజం కోసం కృషి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

సుస్థిర సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ నాసర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర ప్రభుత్వం కోసం 17 రకాల లక్ష్యాలను ఇచ్చినట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరి కనీస అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలను జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మస్తాన్ నాయక్ , ఎపిఎం పోలయ్య, ఎఒ జవహర్‌లాల్ నాయక్, సచివాలయ కార్య దర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయాల విఆర్‌ఒలు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుకుమార్ వేసవి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ హైమావతి పాల్గొన్నారు. **మద్దిపాడు :** మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి తమ విధి విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సుబ్బారావు, ఎంఇఒ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు మీనా, ఎఎస్‌ఒ విజయ లక్ష్మి, డాక్టర్ టి. ఆనంద మోహన్‌రావు, అంగన్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. **కొండపి :** స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహశీల్దారు పి.శింగారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది, అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డిజి), స్పందన గురించి సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య, ఎస్ఐ రమణయ్య, పెట్లూరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ అనూషా పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

కొండపి : మండల పరిధిలోని పెదకండ్లగుంట గ్రామంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్లూరు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బి.సత్యనారాయణ, ఎంపిడిఒ బి.సుబ్బారావు, పెట్లూరు సిహెచ్‌ఒ ఎస్.కృష్ణంరాజు, ఎంపిహెచ్ఎస్ నారాయణ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

షంషీర్ అలీబేగ్ ట్రస్ట్ చేపడుతున్న సేవలు అభినందనీయమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోర్టు సెంటరులో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం హర్షనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు ఎం.ఉస్మాన్ భేగ్, వైసిపి నియోజక వర్గ నాయకుడు కుందురు కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, షమ్స్ ఉల్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

ఉలుమ్ బిఇడి కళాశాల అధినేత ఎం. జాఫర్ అలీభేగ్, అఖిల భారత యాదవ మహాసభ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పిఎల్‌పి.యాదవ్, ఇండ్ల ఫౌండేషన్ చైర్మన్ ఇండ్ల వెంకట రవికుమార్‌రెడ్డి, ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె.మహమ్మద్ రఫీ, మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు గుంటక చెన్నారెడ్డి, ఎం.ఉత్తంకుమార్, బుదాల గురవయ్యపాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - పొదిలి

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి అన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని మొత్తం 1,065 గ్రూపులకు రూ.8,06,73,635 రూపాయల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ బాబూరావు, ఎంపిడిఒ శ్రీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైసిపి నాయకులు గొలమారి చెన్నా రెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి కొవెలకుంట్ల నరసింహా రావు, మాజీ జడ్‌పిటిసి సాయి రాజేశ్వరరావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుల సంజీవ రెడ్డి, ఎపిఎం మాణిక్యరావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

74 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, చౌటపాలెం, దాదా నాయుడుపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 907 బేళ్లను గురువారం అమ్మకానికి తెచ్చారు. అందులో 833 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 74 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక రూ.200, అత్యల్ప ధర రూ.179, సరాసరి ధర రూ.193.30 పైసలు పలికినట్లు నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండల పరిధిలోని పాత మద్దపాడు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ గ్రామీణ క్లినిక్‌ను కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ గ్రామీణ క్లినిక్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ క్లినిక్‌ల్లో 14 రకాల వ్యాధులకు రక్తపరీక్షలు, 60 రకాల మందులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఎ. నాగరాజ్యలక్ష్మి, సర్పంచి అరుణ, గృహ సారథుల మండల కన్వీనర్ శీలం సుదర్శనం, మాజీ సర్పంచి మాల్యాద్రి పాల్గొన్నారు. అనంతరం మద్దపాడు, పెద్దన్నపల్లి, గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

పేదలకు మెరుగైన వైద్యసేవలే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. మండలానికి మంజూరైన రెండో 104 వాహనాన్ని మండల పరిధిలోని బొట్లపాలెం గ్రామంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు వైద్యసేవలు విస్తృతంగా అందించాలనే లక్ష్యంతో మండలానికి రెండో వాహనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, నారపరెడ్డి, ఎంపిపిలు గోళ్లపాటి సుధారాణి, తాటికొండ శ్రీనివాసరావు, సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, ఉషామురళి, కోటేశ్వరమ్మ చంద్రశేఖర్, జడ్‌పిటిసిలు మారం వెంకటరెడ్డి, నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్లు బత్తినేని వెంకటేశ్వర్లు, మేడికొండ జయంతి, వై. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కుమ్మిత అంజిరెడ్డి, మూలంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.


104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

మద్దిపాడు : గ్రామీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మద్దిపాడు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ మానస తెలిపారు. మండలానికి మంజూరైన రెండో 104 వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లలితమ్మ, పిపిహెచ్ఎన్ రజిత కుమారి, హెల్త్ సూపర్ వైజర్లు నాగేశ్వరరావు, బాల కోటయ్య, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు. **సంతనూతల పాడురూరల్ :** ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వాహనాన్ని వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపిపి బి. విజయ, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ సర్పంచ్ దర్శి నాగమణి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి హరిణి , డాక్టర్ నాగరాజు, సిహెచ్ఒ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని ఎం. వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎనికపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామ ఉప సర్పంచి విక్రం నారాయణమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమన్ కుమార్, సిహెచ్ఒ నాగేశ్వరరావు, గ్రామ నాయకులు కోతి కోటేశ్వరరావు, ఎం. శ్రీనివాసులు, పాల్గొన్నారు. **గిద్దలూరు :** పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతోనే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్లు మండల పరిధిలోని తంబళ్లపల్లి సర్పంచి రామాంజ నేయులు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్య కమాన్ని కడప లక్ష్మితో కలిసి సర్పంచి రామాంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి, కష్ణంశెట్టిపల్లి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, సంజీవరావు పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
శుక్రవారం 7 ఏప్రిల్ 2023

మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో మాదక ద్రవ్యాల విక్రయాలు, వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ ఛాంబర్లో జరిగింది. నిషేధిత మాదక ద్రవ్యాలకు విద్యార్థులు ఆకర్షితులు కాకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. ఇటీవల మార్టూరు మండలంలో ఓ ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కలు సాగుచేస్తూ పట్టుబడటంపై కలెక్టర్ ఆరా తీశారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలతో విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గడిచిన మూడు నెలల్లో బాపట్ల జిల్లాలో 58 కేసులు నమోదు కావడంపై క్షుణ్ణంగా సమీక్షించారు. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి అక్రమంగా మాదక ద్రవ్యాల దిగుమతిని అరికట్టాలన్నారు. స్టువర్టుపురం, చీరాల శివారు ప్రాంతాలు, మార్టూరు సమీపంలో మాదకద్రవ్యాలు విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు ఎస్పి.. కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. జాతీయ రహదారిని ఆధారం చేసుకొని అక్రమంగా దిగుమతి చేస్తున్న మాదక ద్రవ్యాలను పూర్తిగా



మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో ఎస్పి

అరికట్టాలని ఎస్పిని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌టిసి, రైల్వే ద్వారా బాపట్లకు ఎగుమతి, దిగుమతి అయ్యే పార్శిల్స్‌ను పరిశీలించాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రజలపై నిఘా ఉంచాలన్నారు. విశాఖ జిల్లా నుంచి బాపట్ల జిల్లాలోకి ప్రవేశించే ఆర్‌టిసి బస్సులపై నిఘా ఉంచాలని, ఇతర వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని అన్నారు. ఆర్‌టిసి డిపో పార్శిళ్ల వద్ద, టోల్‌గేట్ల వద్ద స్కానర్లు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ షాపులలో ఔషధాల అమ్మకాలపై నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ విక్రయాలపై ప్రత్యేక పరిశీలన చేయాలని అధికారులకు ఆమె మార్గనిర్దేశం చేశారు.

ప్రతి పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. మాదక ద్రవ్యాల నిషేధంపై బాపట్ల జిల్లాలోని 70 కళాశాలలు, 10 ప్రభుత్వ సంక్షేమ కళాశాలల వసతి గృహాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వైపు విద్యార్థులు ఆకర్షితులు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావంతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తూ విస్తతంగా చైతన్యం తీసుకురావాలన్నారు. కళాశాలల వద్ద హోర్డింగులు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బాపట్లలో డి-ఎడిక్షన్ కేంద్రాలు, కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపామని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇప్పటికే స్టువర్టుపురం, మార్టూరు, చీరాల, రేపల్లె ప్రాంతాలపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఏఎస్పి మహేష్, ఆర్‌డిఓలు జి రవీందర్, పి సరోజిని, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రాజదెబొరా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, డిఇఓ పివి రామారావు, ఆర్‌టిసి ఆర్‌ఎమ్ రామారావు, సెబ్ ప్రత్యేక అధికారి నరసింహారావు తదితర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవయ్య

నేడు ఆమంచి ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి-పర్చూరు

స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతుందని, ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని సచివాలయ మండల కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, కోట హరిప్రసాదు, మల్లా శ్రీనివాసరావు, లంకా శివ, కాలేషా, తులసి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం: ఎస్పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి మల్లికగర్గ్ తెలిపారు. స్థానిక ఎస్పి కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ చిట్టి నగర్‌కు చెందిన కొరపాటి వీరనాగరాజు, అజయ్‌సింగ్ నగర్‌కు చెందిన కందివలస నరసింహారావు దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. మద్దిపాడు గ్రామంలో గత నెల 28వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు నిందితులు ఒక ఇంటి తలుపు తీసుకుని ఆ ఇంటిలోని రూ.12 లక్షల విలువైన 28 సవర్ల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. ఇంటిలోని వ్యక్తులు నిద్రిస్తుండగా వీరు దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారు దొంగిలిచిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరూ గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్పి క్రైం ఎస్‌వి శ్రీధరరావు, ఒంగోలు డిఎస్పి యు నాగరాజు, రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, మద్దిపాడు ఎస్ఐ శ్రీరామ్ పాల్గొన్నారు. కేసులో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పి అభినందించి ప్రశంశాపత్రాలు అందచేశారు.



పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వడ్డవల్లి వీరనారాయణ

'పది' విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పంగులూరు

విద్యాదాత, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్ష రాసి, బయటకు వచ్చిన విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. పంగులూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఈ సంవత్సరం పంగులూరు, చందలూరు, అలవలపాడు హైస్కూళ్లకు చెందిన 214 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. విద్యార్థులందరికీ అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరపున మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు వీరనారాయణ తెలిపారు. అసలే వేసవి కాలం, అందులోనూ మూడు గంటల పాటు కూర్చొని పరీక్షలు రాసిన విద్యార్థులకు, కొంత ఉపశమనం కలిగేందుకు ఈ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్ట్ తరపున గత కొన్ని సంవత్సరాలుగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున వీరనారాయణ, విద్యార్థులకు అవసరమయ్యే అనేక సౌకర్యాలను కల్పిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా స్వాతంత్ర్య దినోత్సవం అయిన ఆగస్టు 15 తేదీన, గణతంత్ర దినోత్సవం అయిన జనవరి 26వ తేదీన మండలంలోని 46 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులందరికీ, ట్రస్ట్ తరపున బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలలకు నోట్ పుస్తకాలు, ఆడపిల్లలకు శానిటరీ నాప్కిన్‌లు, ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. చందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, రూ.20 లక్షల సొంత నిధులతో, రెండు అదనపు గదులు నిర్మించి ఇచ్చారు. ఇంకా విద్యార్థులకు అనేక అవసరాలు తీరుస్తూ విద్యాదాతగా పేరుపొందారు. విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంచడం పట్ల వీరనారాయణను పలువురు అభినందిస్తున్నారు.

78 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పర్చూరు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

పర్చూరు మండలంలోని నూతల పాడులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో గురు వారం నేత్రవైద్య శిబిరం జరిగింది. కారంచేడుకు చెందిన ఎల్.వి ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు వచ్చి నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 78 మందికి కంటి పరీక్షలు చేసి 23 మందికి శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి సిబ్బంది నాగ రాజు, రెటీనా స్పెషలిస్ట్ శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మిలు పాల్గొన్నారు.

104 అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-మేదరమెట్ల

మేదరమెట్లలోని చిన్న పోలిరెడ్డి ఉచిత వైద్యశాలలో గురువారం 104 అంబులెన్స్‌ను అద్దంకి వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, ఎంపీడీవో డి సురేష్‌బాబు, డాక్టర్ వెంకట సుబ్బారావు, వైద్యశాల సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న బాచిన కృష్ణ చైతన్య

'ఫ్రీడమ్‌బర్డ్స్'లో గ్రీన్ ఛాలెంజ్ కాంపిటీషన్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక లాయరుపేటలోని ఫ్రీడమ్ బర్డ్స్ ఆర్గనైజేషన్‌లో అర్బన్ ఫార్మింగ్ గ్రీన్ ఛాలెంజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎన్ మాల్యాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులకు పాట్ మిక్సర్, విత్తనాలు ఉచితంగా ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 9848605205, 9502316215 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పచ్చదనం, పరిశుభ్రత పాటించాలి: డిఎల్‌పిఓ పద్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత పాటించాలని డిఎల్పిఒ ఆర్ పద్మజ పేర్కొన్నారు. గురువారం ఆమె బోదవాడ పంచాయతీ పరిధిలోని మర్రిచెట్లపాలెంలో రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తాచెదారం డోజర్‌తో తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పారిశుధ్య నిలయాలుగా ఉండాలని, రోడ్లను ఆక్రమించి చెత్తాచెదారం వేయటం నేరమని పేర్కొన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు తగిన శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి సిహెచ్ శ్రీనివాసరావు, సర్పంచ్ జె మరియమ్మ, గ్రామ కార్యదర్శి పి రవికుమార్, జె యాకోబు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య పుట్టినరోజు వేడుకలు ప్రకాశం జిల్లా కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షులు రాయిని రమేష్‌బాబు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి.. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన ఉపాధ్యక్షులు సుబ్బారావు, పార్లమెంట్ అధ్యక్షులు అయినా బత్తిన శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా యువజన అధ్యక్షుడు జొన్న వెంకట్ పాల్గొన్నారు.

సింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని సింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి గురువారం పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ప్రాత్ణకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ తదుపరి వేదపండితులు అర్చకులు ఉభయ దాతలు వేదస్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్య స్వామి వారికి జీవధ్వజ ఉష్ట్రవాహనానికి నారికేళఫల సమర్పణ తదుపరి గణపతి పూజ ఋత్విక్వరుణ తదనంతరం 11 ఆవృత్తాలుగా దేవస్థానం వేదపండితులు అర్చకులు లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. తదనంతరం స్వామివారికి మహానివేదన పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా మద్దిపాడు మండలం ఇనమన మెళ్లూరు గ్రామ వాస్తవ్యులు వీరిశెట్టి వెంకట్రావు, ధనలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పూజ అనంతరం దేవస్థానం వేదపండితుల అర్చకులు ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆర్కిడ్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో దామచర్ల జనార్ధన్

'ఆర్కిడ్' వైద్య సేవలను వినియోగించుకోండి

- మాజీ ఎమ్మెల్యే దామచర్ల - ఘనంగా ఆర్కిడ్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంతాన లేమితో బాధపడుతున్న వారికి అత్యాధునిక వైద్యసేవలందించే 'ఆర్కిడ్' ఫెర్టిలిటీ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు నగరం 60 అడుగుల రోడ్డులో కొత్తగా ఏర్పాటుచేసిన ఆర్కిడ్ ఫెర్టిలిటీ సెంటర్‌ను దామచర్ల జనార్ధనరావు, ఆయన సతీమణి దామచర్ల నాగసత్యలత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఒంగోలులో అన్ని హంగులతో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక పరికరాలు, అన్ని వసతులతో ఆర్కిడ్ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, బిడ్డలు లేని దంపతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్కిడ్ సంతాన సాఫల్య కేంద్రం అధినేత్రి డాక్టర్ సింధూర సింగు మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో దీర్ఘకాలిక సంతానలేమి, కేన్సర్ వ్యాధితో బాధపడే వారికి దాతల కణాలతో సంతాన సాఫల్యతకు తగిన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో సంతాన సాఫల్య వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తమ హాస్పిటల్లో 13 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన ఎంబ్రియాలజిస్ట్ వారి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విజయ హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సింగు విజయ రాఘవరావు హాస్పటల్‌ను సందర్శించి ఆర్కిడ్ సంతాన సాఫల్య కేంద్రం అధినేత్రి డాక్టర్ సింధూరకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పయనీర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ ఎం.బ్రహ్మేశ్వరరావు, సంతనూతలపాడు మాజీ శాసనసభ్యులు బి ఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యరంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-కొత్తపట్నం

వైద్యరంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం పల్నాడు జిల్లా, చిలకలూరిపేటలో లాంఛనంగా ప్రారంభించారు. దీనికి అనుసంధానంగా కొత్తపట్నం మండలం గుండమాల గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలానికి కేటాయించిన 104 వాహనాన్ని, గుండమాలలో నిర్మించిన వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు కొత్తపట్నం పి హెచ్ సి డాక్టర్ వైష్ణవి అధ్యక్షత



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యల ద్వారా దేశానికి మన రాష్ట్రం రోల్ మోడల్‌గా తెలుస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అందులో భాగంగానే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ డాక్టర్స్ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని తెలియజేశారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ వాయుల సుమతి మాట్లాడుతూ ప్రజలు పూర్తి ఆరోగ్య బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వైద్యసేవలు అందేలా అవసరమైన అన్ని పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో మాధవి లత, పంచాయతీరాజ్ డిఇ శివరామకష్ణ, ఎంపీడీవో సుజాత, తహసిల్దార్ రమణారావు, ఎంపీటీసీ వెంకట్రావు, గుండుమల సర్పంచ్ కె జై రావు, మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి, ఈఓఆర్‌డి బాలచెన్నయ్య పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కొత్తపట్నం పిహెచ్‌సిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పరిసరాలను ఆయన పరిశీలించారు.

జిజిహెచ్‌ను మంచి స్థానంలో నిలపాలి

- డిఎంఇ డాక్టర్ కె.సత్య వరప్రసాద్
- క్రిటికల్ కేర్ కాంప్లెక్స్ నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టీమ్ వర్క్‌తో జిజిహెచ్‌ను మంచి స్థానంలో నిలపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డాక్టర్ కె.సత్య వర ప్రసాద్ పేర్కొన్నారు. జిజిహెచ్‌లో నిర్మించబోతున్న క్రిటికల్‌కేర్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని తొలుత ఆయన జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ మరియు ఎపిఎంఐడిసి ఇఇ రవికుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి పరిశీలించారు. క్యాజువాలిటీలో చెయ్యాల్సిన పలు మార్పులను ఆయన సూచించారు. అనంతరం వైద్యులతో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. జిజిహెచ్‌లో 50 పడకల క్రిటికల్ కేర్ కాంప్లెక్స్ కోసం ప్రతిపాదన పరిశీలనలో ఉందని, ఇందు కోసం స్థల పరిశీలన చేసి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక నిర్మాణం చేపడతామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో గ్రీన రీ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. ఖాళీ స్థలాలను, భవిష్యత్తులో నిర్మించబోయే నిర్మాణాలు ఉపయుక్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆ మేరకు ప్రణాళిక ఉండాలని ఎంఎంఐడిసి ఇఇ రవికుమార్‌కు సూచించారు. సమావేశంలో జిజిహెచ్ ఆర్ఎంఓ డా చైతన్యవర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సాల్మన్ రాజు, వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటరమణ, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కె.సత్య వరప్రసాద్

మంచినీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముక్తినూతలపాడు పరిధిలోని క్రాంతినగర్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం, రెండో డివిజన్ ముక్తినూతలపాడులోని క్రాంతినగర్ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఐద్వా ఆధ్వర్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, కమిషనర్‌కి అర్జీ ఇచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ క్రాంతినగర్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మంచినీళ్ల కోసం ప్రతి కుటుంబం రోజుకు రూ.100 పెట్టి కొనుక్కుంటున్న పరిస్థితి ఉందన్నారు. పేదలు నీళ్లు కొనలేక అనేక ఇబ్బందుల్ని పడుతున్నారని, తక్షణమే ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని మంచినీటి పైప్‌లైన్‌ని బాగు చేసి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు స్పందిస్తూ మంచినీటిని తక్షణమే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తానని, పైప్ లైన్ సమస్యను కూడా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చా రు. కార్యక్రమంలో ఐద్వా నగర నాయ కులు కె. రాజేశ్వరి, కె. యశోధర స్థానిక మహిళలు టి.గౌరి, టి.ఆదిలక్ష్మి ఎం .శిరీష, టి.సుబ్బరత్నం, వసుమతి, పి రామ సీత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు